రైతు భరోసా హోల్డ్

- విస్తీర్ణం పెరిగిన సర్వే నంబర్ రైతుల ఆందోళన
- గుంట పెరిగినా భరోసా నిధులకు బ్రేక్
- ఇలా అయితే సగం మంది ఆగమే



లింగాలఘణపురం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సాగుకు పెట్టుబడిగా అందించే సాయం రైతు భరోసా పథకం హోల్డ్‌లో పడింది. గత ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఏడాదికి ఎకరానికి రూ.10వేలు అందజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎకరానికి రూ.15వేలు ఇస్తామన్న హామీ నేడు ఎకరానికి రూ.12వేలకు ఖరారు చేసింది. యాసంగి నుంచి ఈ పథకాన్ని అమలు చేసి సాగుకు యోగ్యం కాని భూములంటూ సర్వే నిర్వహించి కొంత భూమికి బరోసా నిధులు ఇవ్వకుండా తొలగించారు. మండలంలో సాగుకు యోగ్యం కాని భూమి 571 ఎకరాలని, అందులో రైతులు 1,880 మంది ఉన్నారని, సాగుకు యోగ్యమైన భూమి 36,228 ఎకరాలని, 15,866 మంది రైతులని సర్వే నివేదిక అందచేశారు. అందులో ముందుగా ఎకరం భూమి ఉన్న రైతులకు రూ.6వేల చొప్పున వేస్తామని మొదలు పెట్టి ప్రస్తుతం 3 ఎకరాల వరకు బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక సర్వే నంబర్‌లో విస్తీర్ణం పెరిగి ఉంటే ఆ నంబర్‌లో భూమి కలిగిన ప్రతీ రైతుకు భరోసా నిధులను హోల్డ్‌లో పెట్టారు. ఉదాహరణకు మండల కేంద్రంలోని సర్వేనంబర్ 186లో మొత్తం విస్తీర్ణం ఎ.10.06 గుంటలు ఉండగా ఈ నంబర్‌లో ఎ.11.19 గుంటలకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసి ఉన్నారు. అంటే 186 సర్వే నంబర్‌లో ఎ.1.13 గుంటలు పెరిగింది. దీంతో ఈ సర్వే నంబర్‌లో భూమి కలిగిన రైతులందరికి భరోసా నిధులను హోల్డ్‌లో పెట్టారు. ఇలా అయితే సగం మంది రైతులకు కూడా భరోసా నిధులు అందే అవకాశం లేదు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లలో విస్తీర్ణం పెరిగిన నంబర్లే ఎక్కువగా ఉన్నాయి. ఆ సర్వే నంబర్లను సరిచేయడం ఎవరి తరమో.. ఎన్నేళ్లు పడుతుందో తెలియదు.

లబోదిబోమంటున్న రైతులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే రైతు బరోసా ఏడాదికి ఎకరానికి రూ.15వేలు వస్తాయని ఎదురు చూసిన రైతులకు ఏడాది తర్వాత ఈ పథకాన్ని అమలు చేసింది. అందులో సర్వే నంబర్‌లో భూమి ఎక్కువ కలిగి ఉన్నారనే షాక్‌తో నిధులను హోల్డ్‌లో పెట్టడడంతో రైతులంతా లబోదిబోమంటున్నారు.



లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన ఈ రైతు పేరు జాగిళ్లపురం నర్సయ్య. ఇతనికి ఎ.2.10 గుంటల భూమి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉన్నాడు. ఇందులో సర్వే నంబర్ 186/1లో ఎ 1.05 గుంటలు, సర్వే నంబర్ 190/బిలో ఎ.1.05 గుంటల భూమి ఉంది. ఇతనికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరానికి రూ.6వేల చొప్పున 13,500 రైతు భరోసా నిధులు రావాల్సి ఉంది. మూడు రోజులుగా బ్యాంకు వద్దకు వెళ్లాడు. ఏమీ డబ్బులు పడలేదని చెప్పారు. దీంతో రైతు వేదికలో ఉన్న ఏఈఓ స్పందన వద్దకు వెళ్లాడు. పట్టాదారు పుస్తకం ఇవ్వగానే సెర్చ్ ఆప్షన్‌లో చూసిన ఏఈఓ స్పందన సర్వే నంబర్ 190/బీకి సంబంధించి రూ.6,750 సబ్‌మిటెడ్ ఇన్ బిల్స్ అనే వివరాలు మాత్రమే ఉన్నాయని చెప్పింది. మరో సర్వే నంబర్ 186/1కు సంబంధించి వివరాలేమీ కనిపించడంలేదు. సబ్‌మిటెడ్ ఇన్ బిల్స్ అనే వివరాలే కాని ఆ డబ్బులు కూడా బ్యాంకులో జమ కాలేదు. ఎప్పుడు వస్తాయో ఏమో తెలియదు. మీ నంబర్ హోల్డ్‌లో పడిందనే సమాధానం చెప్పడంతో ఏం చేయాలో తోచక లబోదిబోమంటున్నారు.

ఇంకా పూర్తి సమాచారం రాలేదు..

రైతు భరోసా పథకంలో విస్తీర్ణం పెరిగిన సర్వే నంబర్లలో నిధులు పడడంలేదని ఇప్పుడే తెలిసింది. పూర్తి సమాచారం రాలేదు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ వస్తుంది.

– రామారావు నాయక్, డీఏఓ

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

- వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య



ఇసుక తరలింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య

దేవరుప్పుల: మండలంలోని వాగు పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు అనివార్యమని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మస్ పహాడ్, గొల్లపెల్లి, దాదాసాహెబ్ కాలనీ ఏరియా నుంచి అక్రమంగా ఇసుక తరలించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి అత్యంత దోహదపడే బోర్లు, బావులు అడుగంటకుండా ఉండేందుకు ఇసుక తరలించకుండా తగు చర్యలు చేపడతామన్నారు. కాగా, పెద్దమడూర్ వాగు నుంచి జోగు శ్రీశైలం అనే వ్యక్తి చెందిన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఆయన వెంట పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, స్థానిక ఎస్సై ఊర సృజన కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న యాదగిరి, రాజ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: టీఎస్ఈఈ యూనియన్ 327, ఐఎన్‌టీయూసీ, ఐసీఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు, అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యుత్‌శాఖలో బెస్ట్ లీడర్-2024 అవార్డుల ప్రధానోత్సవంలో స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్ కార్మిక యూనియన్ ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఒడ్డెపల్లి యాదగిరి, బూసాని రాజ్‌కుమార్ అవార్డులు అందుకున్నారు. సంజీవరెడ్డి చేతుల మీదుగా వారు అవార్డులను తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెస్ట్ లీడర్-2024 అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందని, సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, నరేందర్‌రెడ్డి, వీరాంజనేయులు, చంద్రశేఖర్, వాసం శ్రీధర్‌పటేల్, అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుష్మాస్వరాజ్‌కు నివాళి



పాలకుర్తి టౌన్: కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ జయంతిని మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా సుష్మాస్వరాజ్ విశేష కృషి చేశారని అన్నారు. మండల అధ్యక్షుడు మారం రవికుమార్, నిరంజన్‌రెడ్డి, దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్, ఈర్ల రాజు, శంకర్ పాల్గొన్నారు.

ఎన్నిక



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామ ఉమా మహేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్‌గా చేగొండ నరహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి మధుశర్మ, సదాశివ నేతృత్వంలో ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. 53 మందితో ఎన్నుకున్న కమిటీలో 10 మంది మహిళా సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఆలయ అభివృద్ధికి అందరు కలసి కట్టుగా పని చేయాలని కోరారు. కమిటీ సభ్యులతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువజన సంఘం అధ్యక్షుడిగా రాంచందర్

లింగాలఘణపురం: అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ నూతన అధ్యక్షుడిగా కుంటి రాంచందర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా గట్టగల్ల పెద్దరాజయ్య, ప్యాట రాములు, యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గట్టగల్ల సంజీవ, కార్యదర్శిగా రాగల్ల ఎల్లేశ్, కోశాధికారిగా ప్యాట నరేశ్, కార్యవర్గసభ్యులుగా యాకయ్య, జహింగీర్, స్వామి, తిరుమలయ్య, బర్రె మల్లేశంలను ఎన్నుకున్నారు. అదే విధంగా గౌరవ అధ్యక్షుడిగా ప్యాట పక్కీరయ్య, గట్టగల్ల రాములును ఎన్నుకున్నారు.

మైనర్లు బైక్ నడిపితే చర్యలు

పాలకుర్తి టౌన్: మైనర్లు మోటర్ సైకిల్ నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మైనర్ విద్యార్థి బైక్ నడుపుకుంటూ పాఠశాలకు వెళ్తుండగా గమనించిన సీఐ స్కూల్‌కు వెళ్లారు. ఉపాధ్యాయుల ఎదుట విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని అన్నారు. మైనర్లు మోటర్ సైకిల్ నడపకుండా విద్యార్థులుకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పాలకుర్తి: హైదరాబాద్ ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో రెడ్ స్టార్ కుంగ్‌పూలో శాతపురం బాలసరస్వతి కేరళ విజన్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సింధు ప్రశాంతి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన బానోత్ వరుణ్‌కుమార్, దేవికను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్, లావణ్య, రంజుషా, కరాటే మాస్టర్ బాలుకుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ మారేపల్లి లలితాదేవి, మారేపల్లి కృష్ణమోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బెలిద వెంకన్న, సారంగపాణి ఉన్నారు.

కొనసాగుతున్న సీపీఎం రిలే దీక్షలు

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ ఎన్‌హెచ్ బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం దీక్షను పార్టీ శాఖ కార్యదర్శి గుండె మల్లేష్ ప్రారంభించి మాట్లాడారు. అండర్‌పాస్ నిర్మిస్తే వివిధ గ్రామాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రశాంత్, జి.స్వప్న, ఎల్లమ్మ, తాండ్ర భాస్కర్, శాలిని, యాదమ్మ, రేణుక ఉన్నారు.

పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలి

- పశుగణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి డాక్టర్ రాధాకిషన్



పశువులకు చికిత్స చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

పాలకుర్తి: పాడి పరిశ్రమను వ్యవసాయానికి అనుబంధంగా అభివృద్ధి చేసుకోవాలని పశుగణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.రాధాకిషన్ అన్నారు. శుక్రవారం ఈరవెన్ను గ్రామంలో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా పశువైద్య శిబిరం, దూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేలు జాతి పశువుల సంతతితో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఉమ్మడి వరంగల్ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వీరమనేని రఘుబాబు మాట్లాడుతూ ఆడ దూడలు పుట్టే విధంగా తయారు చేసిన సెక్స్ సార్టెడ్ సేమన్ అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పాలకుర్తి, చెన్నూరు, మల్లాపూర్ పశు వైద్యాధికారులు డి.అశోక్ రెడ్డి, డాక్టర్ జి.రమ్య, ఎం.అనేష్ పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గోపాల మిత్ర సూపర్‌వైజర్ ఎంపటి రాజేశ్వర్‌రావు, గోపాల మిత్రులు వెంకటయ్య, మధుమోహన్, సమ్మయ్య పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



జనగామ రూరల్: మాట్లాడుతున్న సౌడ రమేశ్

జనగామ రూరల్/నర్మెట: భారతీయ జనతా పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జనగామ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే నర్మెట మండల కేంద్రంలోని పాఠశాలలో రమేశ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేసే సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాగర్ రెడ్డి, ఉడుగుల రమేశ్, పట్టణ అధ్యక్షుడు అనిల్ గౌడ్ జనగామ అసెంబ్లీ ప్రభారి రాజమౌళి గౌడ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ శశిధర్ రెడ్డి, దేవరాయ ఎల్లయ్య, రంగు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



జనగామ: యాదాద్రిభువనగిరి జిల్లా కాచారం మండలం కైలాసపురంలోని అన్నపూర్ణ సత్రం 29వ వార్షికోత్సవం, దేవాలయ 28వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను మున్సిపల్ మాజీ చైర్మన్ పోకల జమున, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లింగయ్యలకు అంజయ్యస్వామి శుక్రవారం అందజేశారు. అలాగే కొత్తపల్లి రాజయ్య, అరుగుల శ్రీనివాస్‌లకు కూడా ఆహ్వాన పత్రికలను అందించారు.

జీపీ భూమిలో వరి సాగుచేసిన కాంగ్రెస్ నాయకుడు



గ్రామ పంచాయతీ భూమిలో వేసిన వరిపంట

చిల్పూరు: వెంచర్ చేసుకున్న వారు ముందుగానే గ్రామ పంచాయతీకి స్థలాన్ని కేటాయిస్తారు. అలా కేటాయించిన భూమిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు కొన్నేళ్లుగా వరి పంట సాగు చేసుకుంటున్నాడు. ఇదేమని గ్రామ పంచాయతీ వారు అడిగితే తన ఇష్టం అనడంతో విషయం బయటకు పొక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. నష్కల్ గ్రామ పంచాయతీ పరిధిలో 57, 58, 59 సర్వే నంబర్‌లో దాదాపు నాలుగేళ్ల క్రితం 10 ఎకరాల స్థలంలో లెజెండ్ డెవలప్‌మెంట్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకుగాను ఎకరం భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఆ భూమిలో జీపీ ఆధ్వర్యాన పూల మొక్కలు నాటి వదిలేశారు. ఆ భూమి వృథాగా ఉంటున్నదని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు అందులో వరి పంట సాగు చేస్తున్నాడు. గతంలో పంట కోసే ముందు విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ వారు మరోసారి పంట వేయొద్దని ఆదేశించినా వినకుండా తిరిగి వరి వేశాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీఓ మధుసూదన్‌ను వివరణ కోరగా.. జీపీ భూమిలో వరి సాగు చేసినట్లు తన దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ పంచాయతీకి చెందిన భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గజానికి రూ.15 వేలు చెల్లించాలి

- కలెక్టర్‌కు ఎన్‌హెచ్–163 బాధితుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

జనగామ రూరల్: జాతీయ రహదారిలో ప్లాట్లు కోల్పోతున్న తమకు గజానికి రూ.15 వేలు చెల్లించాలని బాధితులు కలెక్టర్ రిజ్వాన్ బాషాను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని హైదరాబాద్–హనుమకొండ ఎన్‌హెచ్–163 రోడ్డు లింకు చేస్తూ జనగామ నుంచి దుద్దెడ వరకు నిర్మిస్తున్న రోడ్డులో పట్టణ శివారు ఏకశిలా పాత హైదరాబాద్ రోడ్డుకు ఇరువైపులా ప్లాట్లు కోల్పోతున్న తమకు నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని బాధితులు కోరారు. పిల్లల భవిష్యత్ కోసం కొనుగోలు చేసిన ప్లాట్ల నుంచి రోడ్డు పోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. ఈనెల చివరి వరకు ప్లాట్లు కోల్పోతున్న వారు డాక్యుమెంట్ టైటిళ్లను అధికారులకు ఇస్తే త్వరలో జాబితా విడుదల చేసి నష్టపరిహారం మెరుగైన విధంగా ఇప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధితుల కమిటీ అధ్యక్షుడు బూడిది గోపి, ఉపాధ్యక్షుడు ఇమ్మడి దేవేందర్ రెడ్డి, గౌరవ సలహాదారులు మోకు కనకారెడ్డి, జోగు ప్రకాశ్, ఎండీ.దస్తగిరి, కార్యదర్శి వేమునూరు రాజేంద్రప్రసాద్, గూడెల్లి కృష్ణారెడ్డి, నల్ల యాదగిరి, నంద వెంకటేశ్, అంబటి చిదంబరం, శ్రీనివాస్, ఐల నవీన్‌చారి, బచ్చు విశ్వనాథం, జిట్ట నరసింహ, సదాశివుడు, రాములు, ఎం.రమాదేవి, దయామని పాల్గొన్నారు.

'ఇన్సూరెన్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయొద్దు'

కొడకండ్ల: చనిపోయిన గేదెకు ఇన్సూరెన్స్ ఇవ్వకుండా రుణం చెల్లించాలని డీసీసీ బ్యాంకు అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తేవడం తగదని విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన మహిళలకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో డీసీసీబీ స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచ్ ద్వారా గేదెల కొనుగోలు కోసం రుణాలు ఇచ్చారని, వాటిలో ఒక లబ్ధిదారుకు సంబంధించిన గేదె చనిపోతే పశువైద్యాధికారిచే పోస్టుమార్టం చేయించి ఇన్సూరెన్స్ కోసం బ్యాంకు చుట్టు తిరిగినా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇన్సూరెన్స్ ఇవ్వకుండా రుణాల రికవరి పేరిట పాడి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని, వారి పట్ల డీసీసీబీ అధికారుల తీరుపై సీఎంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా సీతారాముల కల్యాణం

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లి శివారు సీతారామాంజనేయ స్వామి ఆలయంలో అధ్యయన భక్తి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం పూర్ణాహూతి హోమం, విశ్వశాంతి హోమాలు నిర్వహించిన అర్చకులు అనంతరం కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. పలు మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి ఏకాంబరేశ్వర మమ్మాయమ్మ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. శుక్రవారం అఖండ జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణం చేపట్టగా 15వ తేదీన చండీహోమం, లలిత సహస్ర నామం, కుంకుమార్చన, 16వ తేదీన శివపార్వతుల కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

వనదేవతలకు పూజలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని సమ్మక్క బండపై వెలసిన సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు మండలానికి చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మినీ మేడారం సందర్భంగా రెండు రోజులుగా తల్లులకు భక్తులు, గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. నాగేష్‌గౌడ్, లింగస్వామి, రమేశ్, మేకల పవన్, కత్తి సందీప్, కట్ట సురేందర్, యాదగిరి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం భారత రాష్ట్ర సమితి క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, ముసిపట్ల విజయ్, కిరణ్‌కుమార్, కావటి రాజయ్య, సృజన్, హరీశ్, పరశురాములు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన కొలనుపాక సత్తమ్మ మృతి చెందింది. కాగా, శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక అందజేశారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలి

- డీఆర్డీఏ వసంత, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని డీఆర్డీఏ వసంత, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఈనెల 19న నిర్వహించనున్న సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతి నిర్వహణ, చేపట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు అందించారు.

నేడు పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో శనివారం నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు వేలాదిగా తరలిరావాలని సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హమ్యానాయక్ కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

దేవరుప్పుల: పాలకుర్తి మండల కేంద్రంలోని సేవాలాల్ మహారాజ్ భవన్‌లో ఆర్డీఓ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సేవాలాల్ జయంతి వేడుకను విజయవంతం చేయాలని తహసీల్దార్ మహిపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

19న వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఈనెల 19వ తేదీన అధికారికంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా రూ.2కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. మండలంలోని శివునిపల్లిలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. పార్టీ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రాజేష్‌నాయక్, స్వామినాయక్, బూర్ల శంకర్, వెంకటేష్‌నాయక్, రమేష్‌నాయక్, పల్లె రవీందర్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పాఠశాల



రోడ్డుకు దిగువన ఉన్న పాఠశాల



పగుళ్లు వచ్చిన పాఠశాల ప్రహరీ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట ప్రాథమిక పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. పాఠశాల ఎదుట డ్రెయినేజీ నీరు వచ్చి చేరుతుండటంతో దుర్వాసన వస్తోంది. అలాగే ప్రహరీ పక్కన మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ కారణంగా నీరు నిలుస్తుండడంతో గోడకు పగుళ్లు వచ్చి ప్రమాదకరంగా మారింది. దీంతో పాఠశాలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. రోడ్డు కంటే దిగువన ఉన్న పాఠశాలకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుని నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు.

త్రికూటాలయ పరిరక్షణకు ముందుకొచ్చిన యువత

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన త్రికూటాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామ యువకులు చరిత్రకు సాక్ష్యంగా ఉన్న త్రికూటాలయ పరిరక్షణకు ముందుకు వచ్చారు. గ్రామంలోని దేవాదుల రిజర్వాయర్ సమీపంలో విశాలమైన స్థలంలో కాకతీయ రాజులు రాతితో త్రికూటాలయం నిర్మించారు. అప్పటి నుంచి గ్రామస్తులు పూజలు నిర్వహించేవారు. కొద్ది సంవత్సరాలుగా దాన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో ఆలయంలో కొందరు పశువులను కట్టేయగా చెత్తాచెదారంతో నిండిపోయింది. కాగా, గ్రామానికి చెందిన కన్నెబోయిన అశోక్, కందికొండ అనీల్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది యువకులు ఆలయ పరిరక్షణకు ముందుకొచ్చి వారంరోజులుగా ఆలయాన్ని శుభ్రం చేయించారు. అలాగే ఆలయంలో విద్యుత్ దీపాలతోపాటు గేటును ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పండుగ వరకు భక్తుల కోసం ఆలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని వారు తెలిపారు. ప్రశాంత్, రవి, శ్రీకాంత్, అరవింద్, గణేష్ తదితరులు ఉన్నారు.



శుభ్రం చేసిన ఆలయ ప్రాంగణం, (ఇన్‌సెట్‌లో) ఏర్పాటు చేసిన గేట్